క్లుప్తంగా

డీఎస్పీ ఆకస్మిక తనిఖీ



నవాబుపేట: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి.. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతిని తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షల సందర్భంగా నిర్వహిస్తున్న బందోబస్తు, రోజువారీ పెట్రోలింగ్ విధులు తదితర వాటిపై ఆరా తీశారు. తాజాగా జరిగిన ఇద్దరు టీనేజర్స్ గొడవకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు సైబర్ నేరగాళ్ల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని ఎస్ఐ విక్రమ్‌కు డీఎస్పీ సూచించారు.

రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం



దేవరకద్ర: రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ చౌకధర దుకాణాల్లో సన్నబియ్యం పంపిణీ చేయాలని తహసీల్దార్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ కార్డుదారులకు సన్నబియ్యం పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఇప్పటికే స్టాక్ పాయింట్‌లకు సన్నబియ్యం సరాఫరా చేసినట్లు వివరించారు. చౌకధర దుకాణాల వద్ద తప్పనిసరిగా బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ దీపిక, ఆర్ఐ శరత్ ఉన్నారు.

ఆర్అండ్ఆర్ పరిహారం మంజూరుపై హర్షం



జడ్చర్ల: మండలంలోని ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసితులకు ప్రభుత్వం ఆర్అండ్ఆర్ పరిహారం మంజూరు చేయడంతో హర్షం వ్యక్తంచేస్తూ శుక్రవారం వల్లూరులో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కృషితో ఉదండాపూర్ నిర్వాసితులకు మొదటి విడతగా రూ. 45కోట్లు, తాజాగా మరో రూ. 30కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. నిర్వాసితుల పక్షాన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి నిలబడి న్యాయం చేసేందుకు చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు ఖాజాపాషా, మాజీ ఎంపీటీసీ ఎల్లప్ప, రాఘువేందర్, వెంకటేశ్, సత్యయ్య పాల్గొన్నారు.

నియామకమైన నాటి నుంచే సర్వీసు లెక్కించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నియామకమైన 2019 ఏప్రిల్ 11వ తేదీ నుంచే సర్వీసు లెక్కించాలని తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివప్రసాద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టర్ విజయేందిరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేళ్ల ప్రొహిబిషన్ కాలం పూర్తయిన తేదీ నుంచి కాకుండా నియామకమైన తేదీ నుంచి సర్వీసు లెక్కింపునకు ప్రభుత్వం సానుకూలంగా ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ మేరకు జిల్లాలో కార్యాచరణ చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి పాండు, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాజన సభ

నవాబుపేట: స్థానిక సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం చైర్మన్ నర్సింహులు అధ్యక్షతన రైతు మహాజన సభ నిర్వహించనున్నట్లు సీఈఓ హన్మంతు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులకు ఈ సంవత్సరం అందించిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు, వచ్చే ఆర్థిక సంవత్సరంలో రైతులకు అందించే రుణాలపై చర్చించి సంఘం తీర్మానాలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

వర్ధమాన అంశాలు ఒడిసి పట్టుకోవాలి

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



కవి సమ్మేళనంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సామాజిక సమస్యలతో పాటు వర్ధమాన అంశాలను ఒడిసి పట్టుకుని కవిత్వం రాయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం జిల్లాకేంద్రంలోని లుంబిని పాఠశాలలో మా ఆకృతి హైస్కూల్, పాలమూరు సాహితీ సంయుక్త ఆధ్వర్యంలో కవి సమ్మేళనం నిర్వహించారు. అంతకుముందు పరమాత్మ దర్శనం, యువ శతకం పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలమూరు జిల్లా ఎంతో మంది కవులకు నిలయమని పేర్కొన్నారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమంలో ఇక్కడి కవులు ఎన్నో కవితలు, పాటలు రాశారని, కీలక పాత్ర పోషించారన్నారు. అనంతరం కవులు మహ్మద్ ఖాజామైనొద్దీన్, డా.కిక్కా హరీష్‌కుమార్‌కు ఉగాది పురస్కారాలను అందజేశారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన 60 మంది కవులు కవితాగానం చేశారు. వీరందరినీ ఘనంగా సన్మానించి జ్ఞాపికలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల కో–ఆర్డినేటర్ జి.రఘు, పుస్తక రచయితలు పార్ల లింగప్ప, నాగం గోపాల్‌రెడ్డి, కవులు డా.భీంపల్లి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యానిధికి రూ.లక్ష చెక్కు అందజేత

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మహబూబ్‌నగర్ విద్యానిధికి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తన జీతం నుంచి రూ.లక్ష చెక్కును శుక్రవారం కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహబూబ్‌నగర్ విద్యానిధిని జనవరిలో ప్రారంభించగా, ప్రతినెలా తన జీతం నుంచి రూ.లక్ష విరాళం అందిస్తున్నట్లు చెప్పారు. విద్యానిధితో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మేలు చేకూరుతోందన్నారు. వ్యాపారవేత్తలు, విద్యావంతులు, ఉద్యోగులు విద్యానిధికి విరివిగా విరాళాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సీజే బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

నవాబుపేట: గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీఓ జయరాంనాయక్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వేసవిలో తాగునీటి ఇబ్బందులు ఏర్పడకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ఉగాది పండగ నేపథ్యంలో తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. సంబంధిత అధికారులు తాగునీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. నర్సరీల్లో మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో ఈఓపీఆర్డీ భద్రునాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సమీయుల్లా ఖాన్ ఉన్నారు.

రైతులకు ఇచ్చిన హామీల అమలులో విఫలం



పాలమూరు: ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ కిసాన్‌మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పాపన్నగౌడ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బీజేపీ కిసాన్‌మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపం ఎదుట ఉన్న ధర్నాచౌక్‌లో రైతు సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులందరికీ రూ. 2లక్షల పంట రుణాలు మాఫీ చేయకపోవడం బాధాకరమన్నారు. ఏడాదికి రూ. 15వేల చొప్పున రైతుభరోసా ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ. 12వేలు మాత్రమే ఇస్తామని మాట మార్చారన్నారు. అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన పథకం రాష్ట్రంలో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పద్మజారెడ్డి, బాలకృష్ణ, గోవర్ధన్‌గౌడ్, వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణవర్ధన్‌రెడ్డి, అంజయ్య, రాజేందర్‌రెడ్డి, సతీష్ పాల్గొన్నారు.

పరిగి ఎమ్మెల్యేకు మంత్రి పదవి ఇవ్వాలి

మహమ్మదాబాద్: పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నారాయణ కోరారు. శుక్రవారం మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆకాంక్ష మేరకు నిబద్ధతతో నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డికి మంత్రి పదవి ఇస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పరిగి నియోజకవర్గానికి గడిచిన 30 ఏళ్ల నుంచి మంత్రి పదవి రాలేదని.. అన్ని అర్హతలు ఉన్న ఆయనకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు.

పాదయాత్ర విజయవంతం చేయాలి



అడ్డాకులలో సమావేశమైన కాంగ్రెస్ నాయకులు

అడ్డాకుల: జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్‌లో భాగంగా వచ్చేనెల 2వ తేదీ నుంచి గ్రామాల్లో నిర్వహించే పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు తోట శ్రీహరి కోరారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పాదయాత్రలో బీసీ రిజర్వేషన్, ఎస్సీ వర్గీకరణ, యువవికాసం అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు కందూర్ నాగిరెడ్డి, విజయమోహన్‌రెడ్డి, కొండా జగదీశ్వర్, నాగార్జున్ రెడ్డి, భీమన్నయాదవ్, సయ్యద్ షఫి, లక్ష్మీనారాయణ, తిరుపతయ్య యాదవ్, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పథకాలపై అవగాహన కల్పించాలి

జడ్చర్ల: కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బూర్ల వెంకటయ్య, మాజీ ఎంపీపీ నిత్యానందం అన్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ సన్నాహక సమావేశం నిర్వహించారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, గోపాల్, రవి, హబీబ్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం

దేవరకద్ర: ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షుడు సాయిబాబా పిలుపునిచ్చారు. దేవరకద్ర ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆలోచనా విధానం, రాజ్యాంగం విశిష్టతను తెలియజేసేందుకు వచ్చేనెల 2వ తేదీ నుంచి గ్రామగ్రామానా చేపట్టే సంవిధాన్ యాత్రలో ప్రజలను చైతన్యపరచాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భీంరెడ్డి, రామాంజనేయులు, గోపాల్, వినోద్, నాగరాజు, పూర్ణిమ పాల్గొన్నారు.

బిల్లుల కోసం పోస్టుకార్డు ఉద్యమం



పోస్టుకార్డులతో మాజీ సర్పంచులు

జడ్చర్ల టౌన్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం తాజా మాజీ సర్పంచులు పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ సందర్భంగా బాదేపల్లి పోస్టాఫీస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్ చందర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి.. దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన తమకు 16 నెలలుగా బిల్లులు ఇవ్వకుండా తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నారని వాపోయారు. బిల్లుల కోసం నిరసన కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహిస్తున్నా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆర్థికంగా మరింత కుదేలు చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వీడాలని పోస్టుకార్డు ద్వారా సీఎంకు తమ విన్నపాన్ని పంపిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల నుంచి మాజీ సర్పంచులు పోస్టుకార్డు ఉద్యమంలో పాల్గొంటున్నట్లు చెప్పారు. శాంతియుతంగా తాము చేస్తున్న ఉద్యమాన్ని పోలీసుల ద్వారా అణచివేయాలని చూడటం సరికాదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామకృష్ణారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, రవీందర్‌రెడ్డి, నాయకులు శంషీర్, ప్రకాష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



లింగాయపల్లిలో సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మహమ్మదాబాద్/భూత్పూర్: గ్రామాలను అన్నివిధాలా అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని డీసీసీ మాజీ అధ్యక్షుడు కమతం శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఆర్గనైజింగ్ కార్యదర్శి రాములు అన్నారు. శుక్రవారం మహమ్మదాబాద్ మండలంలోని ముందలితండా గ్రామపంచాయతీ లింగాయపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 25లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించడంతో పాటు సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కమతం విష్ణువర్ధన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతిబాయి, లక్ష్మయ్య, కేశవులు, మాజీ సర్పంచ్ నీలేష్, గోవర్ధన్, కొండారెడ్డి పాల్గొన్నారు.

■ భూత్పూర్ మండలంలోని తాటికొండ, మద్దిగట్ల గ్రామాల్లో సీసీరోడ్డు పనులను ఎంపీడీఓ ప్రభాకర్ ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ. 11 లక్షలతో మద్దిగట్ల స్టేజీ నుంచి ఎల్కిచర్ల, తాటికొండలో సీసీరోడ్లు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



జిల్లా కేంద్రంలో నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లింలు

స్టేషన్ మహబూబ్‌నగర్/జడ్చర్ల/చిన్నచింతకుంట: వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో ముస్లింలు చేతికి నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని మసీదు, మసీదే నూర్ వద్ద జుమా నమాజ్ అనంతరం ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ముస్లింలు మౌన ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో మసీదు ఖతీబ్ ఇమామ్ మౌలానా గులాం మహమ్మద్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రహెమాన్ సోఫి, ఆల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు జహంగీర్‌బాబా, మహ్మద్ యాకుబ్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ షబ్బీర్, మాజీ కౌన్సిలర్ ముజంబిల్, ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్, అబ్దుల్ హమీద్, మహ్మద్ ముస్తఫా, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

■ కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు చేపట్టవద్దని జడ్చర్లలో ముస్లిం మైనార్టీ నాయకులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. స్థానిక పాత బజార్ జామే మసీదులో ప్రార్థనల అనంతరం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లుపై చర్చించారు. బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జామే మసీదు అధ్యక్షుడు మహ్మద్ ఖరీం పాల్గొన్నారు.

■ చిన్నచింతకుంట మండలం పెద్ద వడ్డెమాన్‌లోని అబ్దుల్ మాలిక్ మసీదులో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత పెద్దలు అబ్దుల్ ఖాదర్, జహంగీర్, షర్ఫుద్దీన్, మహబూబ్‌అలీ, అరీఫ్, షకీర్ అహ్మద్, ముజీబ్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్ ఏ ఖదర్ వేడుకలు



రాజాపూర్‌లో ముస్లింలకు రంజాన్ తోఫా అందిస్తున్న నాయకులు

అడ్డాకుల/కోయిల్‌కొండ/రాజాపూర్: ఉమ్మడి అడ్డాకుల మండలంలోని గ్రామాల్లో గురువారం రాత్రి షబ్ ఏ ఖదర్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అడ్డాకుల, కందూర్, పొన్నకల్, రాచాల, శాఖాపూర్, మూసాపేట, జానంపేట, వేముల, చక్రాపూర్, తిమ్మాపూర్ మజీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దువా, నాతే షరీఫ్, సలాం చదివి జాగరణ చేశారు. రంజాన్ మాసం చివరి శుక్రవారం జుమాతుల్‌విదా ప్రార్థనలు నిర్వహించారు.

■ మూసాపేట జామే మసీదులో ఆజాద్ విద్యాసంస్థల చైర్మన్ గౌస్ మైనుద్దీన్ (బాబా) ముస్లింలకు ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్, బీఆర్ఎస్ నాయకుడు నామాల మశ్చందర్‌నాథ్, మసీదు కమిటీ నాయకులు ఖాజామైనుద్దీన్, టైలర్ కలీం, అబ్దుల్ ఖాదర్, అప్సర్, అబ్దుల్లా, హైమద్, ఆబిద్, సలాం, కలీల్ పాల్గొన్నారు.

■ మతసామరస్యానికి ఇఫ్తార్ ప్రతీకగా నిలుస్తుందని టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు చిట్టెం అభిజయ్ రెడ్డి అన్నారు. కోయిల్‌కొండ మండలం గార్లపహాడ్‌లో లీగల్‌సెల్ కన్వీనర్ రాఘవేందర్‌రెడ్డి, పార్టీ నాయకుడు జాయిద్ ఏర్పాటుచేసిన ఇఫ్తార్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, మల్లేష్ గౌడ్, దస్తగిరి, రవినాయక్, శేఖర్, వెంకటేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

■ రాజాపూర్ మండల కేంద్రంలో శనివారం మాజీ ఎంపీటీసీ అభిమన్యురెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు రంజాన్ తోఫాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు కొప్పిరి బచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ సంతోషంగా పండగ జరుపుకోవాలని అభిమన్యురెడ్డి రంజాన్ తోఫాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, నర్సింహులు, సున్నపు శ్రీనివాస్, సత్యయ్య, అల్తాఫ్, లింగం పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో వసతుల కల్పనకు కృషి



బాలానగర్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్లటౌన్/రాజాపూర్(బాలానగర్): జడ్చర్ల నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్ ప్రాథమిక పాఠశాలలో ఏఐ ల్యాబ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు అన్ని వసతులు కల్పించి.. మెరుగైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల ఏర్పాటు చేస్తోందన్నారు. అందులో భాగంగా బాలానగర్ మండలం పెద్దాయపల్లి శివారులోని 25ఎకరాల్లో రూ.150కోట్లతో పాఠశాల భవన సముదాయం నిర్మిస్తున్నట్లు చెప్పారు.కార్యక్రమంలో నాయకులు రాజేందర్‌రెడ్డి, తిరుపతి, శంకర్ పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో పండగ జరుపుకోవాలి..

రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని జడ్చర్ల చంద్రాగార్డెన్‌లో నియోజకవర్గంలోని ముస్లింలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఒబేదుల్లా కొత్వాల్ పాల్గొన్నారు. ముస్లింలకు పండ్లు తినిపించి ఉపవాస దీక్షను విరమింపజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అందరూ ఆనందోత్సాహాలతో పండగ జరుపుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పంట రుణాలు రెన్యూవల్ చేసుకోండి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ జితేందర్‌రెడ్డి

అడ్డాకుల: సింగిల్‌విండోలో పంట రుణాలు పొందిన రైతులు సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ మద్దూరి జితేందర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మహాజన సభలో ఆయన మాట్లాడారు. రైతుల శ్రేయస్సు కోసం సహకార సంఘం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన ప్రతి రైతుకుకొత్తగా పంట రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సింగిల్‌విండోలో రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. సొసైటీ ద్వారా ప్రభుత్వ మద్దతు ధరకు వరిధాన్యం కొనుగోలు చేస్తున్నామని.. రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమావేశంలో సీఈఓ వెంకటయ్య, డైరెక్టర్లు రాజవర్ధన్‌రెడ్డి, వీబీ రాజు, బుచ్చన్నగౌడ్, కృష్ణయ్య, నర్సింహారెడ్డి, జ్యోతి, చంద్రశేఖర్, పులీందర్, గోపి, కొండమ్మ, ఫీల్డ్ ఆఫీసర్ కల్పన, సిబ్బంది రాఘవేంద్ర, మల్లేష్, గోవిందమ్మ ఉన్నారు.

నేడు 'కురుమూర్తి'లో నాటక ప్రదర్శన

చిన్నచింతకుంట: కురుమూర్తి స్వామి జాతర మైదానంలో శనివారం రాత్రి 8 గంటలకు జీన్గురాల శ్రీలక్ష్మీ వెంకటనరసింహస్వామి కళానాట్య మండలి ఆధ్వర్యంలో సప్తమాంకములు నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఎం.భాస్కర్‌గౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మాయసభ, శ్రీకృష్ణ కుచేలుడి ఘట్టం, శయన దృశ్యం, గయోపాఖ్యానం, ఉపప్లావ్య ఘట్టం వంటి నాటక ప్రదర్శనలు ఉంటాయని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వీక్షించాలని ఆయన కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవాబుపేట: బస్సులో ప్రయాణిస్తున్న వ్యక్తిపై దాడికి పాల్పడిన ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. శుక్రవారం నవాబుపేటకు చెందిన వినోద్ మహబూబ్‌నగర్‌కు బస్సులో వెళ్తుండగా.. అదే గ్రామానికి చెందిన సోహేబ్ పాత గొడవలను మనసులో పెట్టుకొని దాడికి పాల్పడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు సోహేబ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన అడ్డాకుల సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ఎం.శ్రీనివాస్ వివరాల మేరకు.. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన తులసివర్ధన్‌రెడ్డి, అతడి భావ మల్లికార్జున్‌రెడ్డి, అక్క సుమతి, మరో ఇద్దరు పిల్లలతో కలిసి కారులో హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బయలుదేరారు. అయితే అడ్డాకుల దాటిన తర్వాత ఓ ట్రక్కు సడెన్‌గా అడ్డు రావడంతో కారు అదుపుతప్పి ఢీకొట్టింది. ప్రమాదంలో కారులో ఉన్న మల్లికార్జున్‌రెడ్డి, సుమతి గాయపడ్డారు. మిగతా వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. క్షతగాత్రులను టోల్‌ప్లాజా అంబులెన్స్‌లో జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ సంతోష్ మిశ్రపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మసీదు అభివృద్ధికి రూ.50 వేల విరాళం



భూత్పూర్: మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ జామియా మసీదు అభివృద్ధికి శనివారం స్థానిక బీజేపీ నాయకుడు కెంద్యాల శ్రీనివాస్ రూ. 50వేల విరాళం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాజగోపాల్‌రెడ్డి, శ్రీధర్, ఫారూఖ్, యాదగిరి, రమేశ్, నర్సింహులు, భాస్కర్, మసీదు కమిటీ సభ్యులు డా.పాషా, మహమూద్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



దేవరకద్ర రూరల్: కౌకుంట్లకు చెందిన ఎలిమె లక్ష్మన్న, యోషమోని గాలెన్నకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషన్‌రావు అందజేశారు. ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవతో బాధితులకు సీఎంఆర్ఎఫ్ నుంచి ఆర్థికసాయం మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన అధ్యక్షుడు నరేష్, గ్రామాధ్యక్షుడు ప్రభు తదితరులు పాల్గొన్నారు.

గోర్‌బోలి భాషను గుర్తించడం హర్షణీయం



స్టేషన్ మహబూబ్‌నగర్: గోర్‌బోలి లంబాడ భాషను 8వ షెడ్యూల్‌లో చేర్చేలా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడం హర్షణీయమని జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ లింగంనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో ఆదివాసీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ చైర్మన్ మహేశ్ కుమార్‌గౌడ్, మంత్రి జూపల్లి కృష్ణారావు, బెల్లయ్య నాయక్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం లింగం నాయక్ మాట్లాడుతూ.. దేశంలోని 11 రాష్ట్రాల్లో 15 కోట్ల మంది లంబాడి భాష మాట్లాడతారని అన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో చేయని విధంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గోర్‌బోలి లంబాడ భాషను 8వ షెడ్యూల్ చేర్చడంపై ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ వైస్‌చైర్మన్ రాములునాయక్, పట్టణ అధ్యక్షుడు పాత్లావత్ రవి నాయక్, మాజీ జెడ్పీటీసీ చందర్‌నాయక్, నాయకులు యాదగిరి, రాంచందర్, గోవర్ధన్, డాక్య నాయక్ పాల్గొన్నారు.